సాక్షి నంద్యాల

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



దోపిడికి 'టెంకాయ' కొట్టారు

తర్తూరు జాతరలో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు అధిక ధరలకు చిన్న సైజ్ టెంకాయలు విక్రయిస్తున్నారు. 10లో▸



ఈదురుగాలుల బీభత్సం

ఈదురుగాలుల బీభత్సానికి ప్యాపిలి మండల పరిధిలోని పీఆర్ పల్లె గ్రామంలో అరటితోట నేలకొరిగింది. రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. 10లో▸



మామిడిని ఆరోగ్యంగా మాగిద్దాం

మామిడి ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తోంది. ఆరోగ్యకరమైన పద్ధతుల ద్వారా కాయలను మాగించాల్సిన అవసరం ఉందని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. 10లో▸

న్యూస్‌రీల్

బలగం చిత్రంతో మంచి గుర్తింపు



నటుడు సంజయ్ కృష్ణ

మహానంది: బలగం సినిమాతో తనకు మంచి గుర్తింపు వచ్చిందని సినీ నటుడు సంజయ్ కృష్ణ అన్నారు. గురువారం మహానందికి వచ్చిన ఆయన శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్ల ను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయానికి వచ్చిన నటుడిని గుర్తించిన అభిమానులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 24 వరకు దరఖాస్తు

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఈఏపీ సెట్ దరఖాస్తుకు ఈనెల 24వ తేదీ వరకు గడువు ఉందని అధికారులు తెలిపారు. మే 19, 20 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు, అలాగే మే 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్‌కు సంబంధించిన టెస్టు నిర్వహించనున్నారు. దరఖాస్తు సమయంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఏపీఈఏపీ సెట్ వెబ్‌సైట్‌లో పరీక్ష రాసేందుకు అర్హతలు, ఏపీ ఈఏపీ సెట్‌కు సంబంధించిన ముఖ్యమైన తేదీలు, గమనికలు.. తదితర పూర్తి వివరాలు పొందవచ్చు.

అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ విచారణ



ఎంపీడీఓతో మాట్లాడుతున్న చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానివర్షా

బనగానపల్లెరూరల్ : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, హార్టికల్చర్ తదితర పథకాల్లో జరిగిన అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ఎస్‌ఆర్‌ఈజీఎస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానివర్షా గురువారం విచారణ చేశారు. పలు ఆరోపణలు రావడంతో ఎస్‌ఆర్‌జీఎస్ పథకంలో విధులు నిర్వహించే టీఏ, ఈసీలను ఇటీవలనే జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన విచారణ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి అన్వరాబేగం, ఏపీడీ నరసింహారెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ ప్రతాప్, ఈసీ, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

21నాటికి ప్రోగ్రెస్ కార్డులు అందించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రోగ్రెస్ కార్డును ఈనెల 21వ తేదీ నాటికి అందించాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం పాఠశాలల ముగింపునకు సంబంధించిన అంశాలపై జేసీ వెబెక్స్ ద్వారా విద్యాశాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచే విద్యార్థులను ఉన్నత తరగతులకు ప్రమోట్ చేసి అదే రోజు నుంచి బోధన జరిగేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,21,632 మంది విద్యార్థులను ఉన్నత తరగతులకు ప్రమోట్ చేయాలన్నారు. 1,886 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని ప్రాథమిక విద్యలోకి చేరుతుండడంతో వారంతా పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో డీఈఓ శామ్యూల్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లు పైబడిన వృద్ధులకు గుర్తింపు కార్డులు

కర్నూలు(అర్బన్): జిల్లాలో 60 సంవత్సరాల వయస్సు పైబడిన వయో వృద్ధులు సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయాల పరిధిలోని వారు వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ, గ్రామ సచివాలయాల పరిధిలోని వారు డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్డుకు పురుషులు 60 సంవత్సరాలకు పైబడి, మహిళలు 58 సంవత్సరాలకు పైబడిన వారు అర్హులన్నారు. గుర్తింపు కార్డుల జారీకి ఎలాంటి ఆన్‌లైన్ దరఖాస్తులు తమ కార్యాలయంలో స్వీకరించబడవని ఆమె స్పష్టం చేశారు.

చెల్లని ఎంపీ!

ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేలు

జిల్లాలో కూటమి ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత కొరవడింది. ఎంపీతో ఎమ్మెల్యేలకు ఏమాత్రం పొసగడం లేదు. తమ నియోజకవర్గాల్లో తమకు సమాచారం ఇవ్వకుండా పర్యటిస్తే సహించేది లేదని ఖరాకండిగా చెప్పేస్తున్నారు. ఎంపీ, ఆమె తండ్రి పెత్తనాన్ని సహించే ప్రసక్తే లేదని చెబుతున్నారు. దీంతో ఎంపీ ఏకాకిలా మిగిలిపోయారనే విమర్శలు జోరందుకున్నాయి.

- జిల్లాలో ఎంపీ బైరెడ్డి శబరి పెత్తనాన్ని సహించేది లేదంటున్న ఎమ్మెల్యేలు
- మద్దూరు సీహెచ్‌సీలో తన వర్గం వారినే నియమించాలని ఎమ్మెల్యే చరిత హుకుం
- ఎంపీ సిఫార్సు చేస్తే ఉద్యోగాలు, కాంట్రాక్టులు ఇవ్వొద్దంటూ సిమెంట్ కంపెనీలకు మంత్రి ఆదేశాలు!
- తాజాగా తర్తూరు జాతరలోనూ ఎమ్మెల్యే గిత్తా జయసూర్యదే పైచేయిగా నిలిచిన వైనం
- ఆళ్లగడ్డలో ఇంతవరకు అడుగుపెట్టలేకపోయిన ఎంపీ

సాక్షి, నంద్యాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. తమ పరిధిలో పోస్టింగులు, కాంట్రాక్టులు, కమీషన్ల విషయంలో జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు.

గౌరు చరిత వర్సెస్ శబరి

పాణ్యం మండల పరిధిలోని మద్దూరు పీహెచ్‌సీలో నైట్ వాచ్‌మన్, స్వీపర్ పోస్టుల విషయమై ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య నిప్పు రాజుకున్నట్లు సమాచారం. ఎంపీ వర్గమైన నతానియేల్(వాచ్‌మన్), ఓ సుబ్బమ్మ(స్వీపర్)లను ఎమ్మెల్యే వర్గం వారు పట్టుబట్టి గతేడాది నవంబర్‌లో సస్పెండ్ చేయించారు. ఏ తప్పు చేయకున్నా తమ వారిని ఎందుకు సస్పెండ్ చేశారని, వారినే ఆయా పోస్టుల్లో కొనసాగించాలని ఎంపీ శబరి జిల్లా వైద్యాధికారులను ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో మూడు నెలల పాటు వాచ్‌మెన్, స్వీపర్‌లు లేకుండా సీహెచ్‌సీ నడిసింది. ఈ విషయం ఎమ్మెల్యే గౌరు చరిత దృష్టికి వెళ్లడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి ఆమె వర్గానికి చెందిన చాకలి వెంకట సుబ్బయ్య, కె. వెంకటమ్మలను తాత్కాలికంగా నియమించారు.

ఆ లేఖలు పక్కన పడేయండి!

ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన వారికి బనగానపల్లెలోని సిమెంట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇవ్వాలంటూ ఎంపీ శబరి సిఫార్సు చేశారు. అయితే ఆయా కంపెనీలు ఎంపీ సిఫార్సులను చెత్త బుట్టలో వేసినట్లు సమాచారం. ఆమె రెఫర్ చేసిన ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వడం లేదని తెలుస్తోంది. అలాగే పరిశ్రమల్లో కాంట్రాక్టు పనులను తమ వారికి ఇవ్వాలని రెఫర్ చేస్తే వాటిని యాజమాన్యం బుట్టదాఖలు చేసినట్లు తెలుస్తోంది. అయితే వీటి వెనక మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హస్తం ఉన్నట్లు ఎంపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు.

నందికొట్కూరులో మరీ దారుణం

ఎంపీ సొంత నియోజకవర్గమైన నందికొట్కూరులోనూ ఆమె మాట చెల్లుబాటుకావడం లేదు. పోలీసుల పోస్టింగ్‌లు, స్టేషన్లలో పంచాయితీలు, రెవెన్యూ కార్యాలయాల్లో రెకమెండేషన్లు... ఇలా ఎక్కడికి వెళ్లినా అధికారుల నుంచి 'నో' అనే సమాధానమే వస్తోంది. తాజాగా భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లోనూ ఎంపీ వర్గానికి చెందిన ఏ ఒక్కరికీ పదవి రాలేదు. నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా మాండ్ర శివానంద రెడ్డి వర్గానికి చెందిన వీరం ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే జిల్లాలో వైభవంగా నిర్వహించే తర్తూరు జాతర నిర్వహణ విషయంలో ఎంపీ వర్గీయుల మాటను పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో బైరెడ్డి రాజశేఖరరెడ్డి వర్గంలోకి వెళ్లిన 11 మంది కౌన్సిలర్లు మాండ్ర వర్గంలోకి జంప్ చేయడం గమనార్హం.

విభేదాలు బహిర్గతం

సార్వత్రిక ఎన్నికల్లోనే భూమా అఖిలప్రియ... బైరెడ్డి శబరి మధ్య మనస్పర్థలు ప్రస్ఫుటంగా కనిపించాయి. నంద్యాల ఎంపీ అభ్యర్థిగా అఖిల భర్త భార్గవరామ్ నామినేషన్ వేయడంతో ఒక్కసారిగా వీరి మధ్య భేదాభిప్రాయాలు బహిర్గతమయ్యాయి. అయితే నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు వరకు భార్గవ్ రామ్ తన నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకోలేదు. టీడీపీ అధిష్టానం నుంచి ఆదేశాలు రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన తన నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. అయితే ఎన్నికల సమయంలో తాము కోరిన మొత్తాన్ని ఎంపీ అభ్యర్థి ఇవ్వకపోవడంతో బెదిరించడానికి ఇలా డ్రామా ఆడినట్లు అప్పుడే జిల్లాలో జోరుగా చర్చ సాగింది. ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఎంపీ బైరెడ్డి శబరి ఒకరినొకరు చూసుకున్నది లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎంపీ అడుగు పెట్టలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నియోజకవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ఎంపీ పాల్గొనడం లేదు. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీకి కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని టీడీపీ నాయకులే చెబుతున్నారు. అయితే కొన్ని నెలల కిందట శిరివెళ్లలో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరై ఒక గంట మాత్రమే ఉండి వెళ్లిపోయారు.

ఒక్క మండలానికే పరిమితం...

బైరెడ్డి రాజశేఖరరెడ్డి పెత్తనంతో ఎంపీ కేవలం ఒక్క మండలానికే పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆమె స్వగ్రామం ముచ్చుమర్రి ఉన్న పగిడ్యాల మండలంలో మాత్రమే ఆమె చెప్పినట్లు నడుస్తోంది. మిగిలిన నియోజకవర్గంతో పాటు జిల్లాలోనూ ఆమె చెప్పినట్లు నడవడం లేదని ఎంపీ అనుచరులే చర్చించుకుంటున్నారు. మరోవైపు శ్రీశైలం, డోన్ నియోజకవర్గాల్లోనూ ఆమె పెద్దగా పర్యటించడం లేదు. ప్రైవేటు కార్యక్రమాలకు ఎవరైనా ఆహ్వానిస్తే ఇలా వెళ్లి అలా వచ్చేస్తున్నారు.



ఉనికి పాట్లు

ఎంపీగా బైరెడ్డి శబరి గెలిచినప్పటికీ ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నీ తానై వ్యవహరించారని పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఎంపీ చురుగ్గా వ్యవహరించడం లేదని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి విషయంలో బైరెడ్డి రాజశేఖరరెడ్డి చొరవ చూపుతున్నారని ఆరోపించారు. అన్ని శాఖల అధికారులు తాను చెప్పింది చేయాలంటూ హుకుం జారీ చేయడంతో పాటు నియోజకవర్గంలో తానే అసలైన ప్రజాప్రతినిధిగా నడుచుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాణ్యం నియోజకవర్గంలోనూ తలదూర్చి అక్కడ కూడా వర్గ రాజకీయాలు చేయడం ప్రారంభించడంతో టీడీపీ నాయకులు అధిష్టానానికి వరుసగా ఫిర్యాదులు చేశారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రస్తుతానికి రాజశేఖరరెడ్డి సైలెంట్ అయ్యారు. అప్పుడప్పుడు తాను ఒకడిని ఉన్నానని ఉనికిని కాపాడుకునేందుకు రాజకీయ విమర్శలు చేస్తూ కాలం గడుపుతున్నారని టీడీపీ నేతలు మాట్లాడుకుంటున్నారు.

ప్రైవేట్ భూములు మార్పు చేయొద్దు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రైవేట్ భూములను 22(ఎ) కింద మార్పులు చేస్తే సంబంధిత తహసీల్దార్లపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి హెచ్చరించారు. అదే విధంగా వెబ్‌ల్యాండ్‌లో ఒకరి పేరుకు బదులు ఇంకొకరి పేరు మీద అనుచితంగా మార్పులు చేర్పులు చేస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో రెవెన్యూ, రీసర్వే అంశాలపై రెవెన్యూ సిబ్బందికి జిల్లా కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ రామునాయక్, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి, డోన్ ఆర్డీఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. ఫ్రీ హోల్డ్ భూములు, రీ సర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ అంశాలపై రెవెన్యూ సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ భూములు గుర్తించడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వీటిపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూముల విస్తీర్ణం, సంబంధిత భూములు ఏ సర్వే నంబరులో ఉందో తెలుసుకోవడానికి ఇన్వెంటర్ రిజిష్టర్లు నిర్వహించాలన్నారు. గుజరాత్ రాష్ట్రంలో ఒక్క సెంటు ప్రభుత్వ భూమి ఉన్న కూడా వారు గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఎక్కువ శాతం పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం వచ్చిందన్నారు.



హొళగుందలో అడ్డ పల్లకీలో ఆశీనులైన కాశీ జగద్గురువు

'భక్తి' మార్గం

హొళగుందలో గురువారం సాయంత్రం కాశీ జగద్గురువు (కాశీ మఠం వారణాశీ పీఠాధిపతులు మల్లికార్జున శివాచార్య మహాస్వాము)ల అడ్డ పల్లకోత్సవం అత్యంత వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం భక్తులకు కాశీ జగద్గురువు ధర్మ సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని బోధన చేశారు.

– హొళగుంద



నందికోళ్ల ప్రదర్శనతో భక్తిని చాటుకుంటున్న ప్రజలు

అక్రమ కేసులతో టీడీపీకి కొమ్ము కాస్తున్నారు!

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు ఎలా నమోదు చేస్తారు?
- పోలీసులపై వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అక్రమ కేసులతో టీడీపీకి పోలీసులు కొమ్ముకాస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండిపడ్డారు.టీడీపీ వారితో ఒక రకంగా.. వైఎస్సార్‌సీపీ నాయకులతో మరో రకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాటసాని మాట్లాడారు. కర్నూలు నగరంలోని నాల్గో పట్టణ సీఐ టీడీపీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. కల్లూరు అర్బన్ పరిధిలోని 31, 34 వార్డులో జరిగిన సంఘటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఎవరిపై అన్యాయంగా కేసులు బనాయించలేదని గుర్తు చేశారు. టీడీపీ నాయకులకు ఒక న్యాయం, వైఎస్సార్‌సీపీకి ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండబోదని గుర్తుపెట్టుకొని పోలీసులు ఉద్యోగాలు చేయాలని హితవు పలికారు.

అన్నీ అబద్ధాలే

ఎన్నికల ముందు తనపై ప్రతిపక్ష నాయకులు అన్నీ అబద్ధాలు ప్రచారం చేశారని కాటసాని అన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా నిరూపించలేకపోయారన్నారు. జగన్నాథ గట్టుపై కబ్జా చేశానని నంద్యాల ఎంపీ శబరి అబద్ధపు మాటలు చెప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవరూ బియ్యం అక్రమ వ్యాపారాలు చేయడం లేదన్నారు. వైన్ షాపులు బార్‌లను తలపిస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుపుకుంటుంటే ఎంపీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రేషన్ బియ్యాన్ని ఏవిధంగా పట్టుకున్నారో అదే విధంగా ఎక్సైజ్ అధికారులను తీసుకొని పోయి వైన్ షాపులపై దాడులు చేయించాలన్నారు. వైన్ షాపుల దగ్గర రోడ్లపై మహిళలు, ప్రజలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మాటమీద నిలబడాలి

టీడీపీ నాయకులు మాటమీద నిలబడాలని కాటసాని అన్నారు. టీటీడీ గోశాలలో గోవుల మృతిపై టీడీపీ నాయకులు ఇచ్చిన సవాల్‌ను స్వీకరించి టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వస్తానన్నారని, అయితే పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేయడం ఏమిటన్నారు. ఆవులు చనిపోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్నారని, టీటీడీ ఈఓ మాత్రం 44, టీటీడీ చైర్మన్ అయితే 22 ఆవులు చనిపోయాయని చెబుతున్నారని, ఎవరిది నిజమో తెలియడం లేదని, పొంతన లేని సమాధానాలు చెబుతున్నారన్నారు. కార్పొరేటర్లు చిట్టెమ్మ, వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరెడ్డి, సాన శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: విద్యాహక్కు చట్టం మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించారని, వచ్చే విద్యా సంవత్సరానికి ఉచిత విద్యను అందించే జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలలు ఈ నెల 19 నుంచి 26వ తేది వరకు తమ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in/లో నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా వచ్చే నెల 16 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థుల ప్రవేశాలకు అర్హతల ఆధారంగా లాటరీ ద్వారా మొదటి విడత సీట్లు కేటాయిస్తామన్నారు. వివరాలను 21 నుంచి 24వ తేదీ మధ్య ప్రకటిస్తామని పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం





బ్యాటింగ్ చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ మైదానంలో ఏపీఎస్పీ ఎస్‌డీఆర్ఎఫ్ పోలీసులకు, సివిల్, ఏఆర్ పోలీసుల జట్లకు నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను గురువారం డీఐజీ, ఎస్పీ కలిసి ప్రారంభించారు. వారు స్వయంగా క్రికెట్ ఆడి సిబ్బందిని ఉత్సాహపరిచారు. కర్నూలు జిల్లా సివిల్, ఏఆర్ పోలీసుల జట్టుకు డీఐజీ కెప్టెన్‌గా, ఏపీఎస్పీ ఎస్‌డీఆర్ఎఫ్ పోలీసులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఇరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ సందర్భంగా డీఐజీ, ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం విధుల్లో ఉండే సిబ్బందికి క్రీడలు నూతనోత్సాహాన్ని ఇస్తాయన్నారు. శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. గెలుపు, ఓటములు సహజమన్నారు. ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్ఎం బాషా, సుధాకర్ రెడ్డి, రవికిరణ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ జేడీ బదిలీ



కర్నూలు(అర్బన్): జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జె.రంగలక్ష్మీదేవిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ గురువారం జీవో ఆర్టీ నెం.80ని జారీ చేశారు. 2023 జూన్ 12న ఆమె ఇక్కడ జేడీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలోనే ఆమెను విజయవాడలోని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతానికి ఇక్కడకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఎవరినీ నియమించలేదు.

కనిష్ట స్థాయికి ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధర కనిష్టస్థాయికి పడిపోతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం అన్ సీజన్ కావడంతో అక్కడక్కడ బావులు, బోర్లు, ఇతర నీటిపారుదల కింద ఉల్లి సాగయింది. కర్నూలు మార్కెట్‌కు ఎనిమిది మంది రైతులు మా త్రమే 479 క్వింటాళ్ల ఉల్లి తెచ్చారు. క్వింటాకు కనిష్ఠంగా రూ.675, గరిష్ట ధర రూ.879 మాత్రమే లభించింది. సగటు ధర రూ.755 నమోదైంది. జిల్లాకు మహారాష్ట్రలో పండించిన ఉల్లి భారీగా దిగుమతి అవుతోంది. ఉల్లితో పాటు మిర్చి, వాము, వేరుశనగ, శనగ తదితర అన్ని పంటల ధరలు పడిపోయాయి. క్వింటా మిర్చి ధర రూ.4వేల నుంచి రూ.7వేల వరకు మాత్రమే పలుకుతోంది.

ముఖ ఆధారిత హాజరులో అవకతవకలు

- ఏడుగురికి చార్జి మెమోలు జారీ

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో ముఖ ఆధారిత హాజరులో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఏడుగురి కి చార్జి మెమోలు జారీ చేశారు. ఇందులో ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఒక ఫార్మాసిస్టు ఉన్నారు. వీరు తమ ఐ ఫోన్ ద్వారా హాజరును మార్ఫింగ్ చేశారని, అక్రమాలకు పాల్పడ్డారని రాష్ట్ర ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు జాబితాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళకు పంపించడంతో ఆమె ఏడుగురికి చార్జి మెమోలు పంపించారు. ఈ మేరకు వివరణ ఇచ్చిన వారు సాంకేతిక లోపం కారణంగానే హాజరు తప్పుగా నమోదైందని, ఇందులో తాము కావాలని చేసిందేమీ లేదని వివరణ ఇచ్చినట్లు సమాచారం. వారు ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందకపోతే కాంట్రాక్టు వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని, రెగ్యులర్ వారిని సస్పెండ్ చేయాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

భూసార పరీక్షలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి భూసార పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్ జేడీఏ పద్మజ తెలిపారు. గురువారం గుంటూరు నుంచి వెబెక్స్ ద్వారా భూసార పరీక్షల నిర్వహణకు సంబంధించి విధి విధానాలను వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి, ఏడీఏ, ఏవోలనుద్దేశించి మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి 25,550 భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని రైతు సేవా కేంద్రాల వారీగా విభజించాలన్నారు. మే నెల 15 నాటికి రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జీలు మట్టి నమూనాలను సేకరించి, మండలాల వారీగా కేటాయించిన భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలని తెలిపారు. ఖరీఫ్ పంటల సాగుకు ముందే రైతులకు భూసార పరీక్ష ఫలితాలు అందించాలని, ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

పొగాకు పంట దగ్ధం



దగ్ధమైన పొగాకు పంటను చూపిస్తున్న కౌలు రైతు ఆకుమళ్ల రాజన్న

బనగానపల్లె: టంగుటూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి కౌలు రైతు ఆకుమళ్ల రాజన్నకు చెందిన పొగాకు దిగుబడి అగ్నికి ఆహుతి అయ్యింది. సమాచారం అందుకున్న బనగానపల్లె అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో వెళ్లి మంటలను అదుపు చేశారు. ఐదు ఎకరాల పొలాన్ని సంవత్సరానికి రూ.1.50 లక్షల మేర కౌలుకు తీసుకున్న రాజన్న పొగాకు సాగు చేశాడు. ఇటీవల పంట కోత పూర్తి చేసి విక్రయానికి సిద్ధంగా ఉంచిన తరుణంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణాలు తెలియలేదు. దాదాపు రూ. 3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి దుర్మరణం

● నలుగురికి గాయాలు



మృతిచెందిన వెంకట్రాముడు (ఫైల్)

కోడుమూరు రూరల్: కర్నూలు – ఎమ్మిగనూరు రహదారిలో వర్కూరు పెట్రోల్ బంకు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన వడ్డె వెంకట్రాముడు (35) తన ఇద్దరు కుమారులు వేణు, అరవింద్‌తో గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు నుంచి బైక్ పై స్వగ్రామానికి బయలుదేరారు. ఇదే సమయంలో కౌతాళం మండలం బదినేహాల్‌కు చెందిన షాషావలి, దాదాపీర అనే యువకులు కర్నూలు కు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ బైక్‌లు ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో వెంకట్రాముడుతో పాటు, కుమారులు వేణు, అరవింద్,మరో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకులు షాషావలి, దాదాపీరలు తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన వారిని 108 లో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకట్రాముడు మృతిచెందాడు. ఈ మేరకు కోడుమూరు పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వలస నుంచి స్వగ్రామానికి వెళ్లేక ముందే..

ప్రమాదంలో మృతిచెందిన వెంకట్రాముడు (35) స్వగ్రామం వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రా మం. అయితే గ్రామంలో ఉపాధి పను లు లేక కొ న్నాళ్ల కిరతం గుంటూరుకు వలస వెళ్తూ.. భార్య లలిత పుట్టినిల్లు గోనెగండ్ల మండలం పెద్దనేల టూరు గ్రామంలో ఇద్దరు కుమారులు, కుమార్తె ను వదిలాడు. ఇటీవల వలస నుంచి తిరిగి వచ్చి న భార్యాభర్తలు పిల్లలను పిలుచుకుని వెళ్లేందుకు పెద్దనేలటూరు వెళ్లా రు. అక్కడ ఇద్దరు కుమారులను వెంకట్రాముడు బైక్‌పై ఎక్కించుకుని శ్రీరంగాపురం బయలుదేరగా,భార్య లలిత కుమార్తెను పిలు చుకుని ఆటోలో బయలుదేరింది. కాగా బయలుదేరిన కాసేపటికి రోడ్డు ప్రమాదంలో వెంకట్రాముడు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు.

మామిడిని ఆరోగ్యంగా మాగిద్దాం



● ఇథిలీన్ వాయువుతో మంచి ఫలితం
● కాల్షియం కార్బైడ్‌తో మాగిస్తే ప్రజల ఆరోగ్యంపై ప్రభావం
● జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు



కర్నూలు(అగ్రికల్చర్): ఏటా వేసవిలో అందరినీ ఊరించే పండు మామిడి. జూన్ వరకు మార్కెట్‌లో మామిడిదే పైచేయి. సంపన్నులైనా.. సామాన్యులైనా.. మామిడి రుచిని ఆస్వాదించాల్సిందే. బంగినపల్లి (బేనీసా) రకం మామిడి అంటే దానికి ఉన్న డిమాండే వేరు. మామిడి ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో పసుపుపచ్చగా కనువిందు చేస్తోంది. రంగు బాగా ఉంది కదాని తింటే అనారోగ్యాలను కొని తెచ్చుకోవాల్సిందే. ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి మాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మామిడి ఆరోగ్యకరమైన పద్ధతుల ద్వారా మాగించాల్సిన అవసరం ఉందని కర్నూలు జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. ఈ ఏడాది మామిడి దిగుబడులు ఒక మోస్తరుగా ఉన్నాయని వీటిని ఆరోగ్యవంతమైన పద్ధతిలో మాగించుకుంటే మంచి డిమాండ్, ధర లభిస్తుందని తెలిపారు. మార్కెట్‌లో మామిడి పండ్లు కొనుగోలు చేసే ముందు సూక్ష్మంగా పరిశీలించాలన్నారు. పండ్లు కొనేటప్పుడు, తినేటప్పు డు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్బైడ్‌కు ప్రత్యామ్నాయంగా పండ్లు మాగించే పద్ధతులను వివరించారు.

పండ్లు ఎలా మాగుతాయి...

సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా పండ్ల నందు ఉత్పత్తి అయ్యే ఇథలీన్ వల్ల మాగడం జరుగుతుంది. ఇథలీన్ పండు పక్వానికి వచ్చినప్పుడు దాని నిర్మాణ, రంగు, రుచి వంటి మార్పులకు ఉపయోగపడుతుంది.



కాల్షియం కార్బైడ్‌తో కృత్రిమంగా మాగిన పండ్లు

సహజ, కృత్రిమంగా మాగిన పండ్లకు తేడాలు...



రంగు..

- సహజంగా మాగిన పండు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వంగా ఉంటుంది.
- కృత్రిమంగా మాగిన వాటిలో పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటాయి. పైకి మాగినట్లుగా కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటాయి.

వాసన..

- సహజంగా మాగిన పండు కొంత దూరంలో ఉన్నప్పటికీ కమ్మని మామిడి పండు వాసన వస్తుంది. కృత్రిమంగా మాగిన పండును ముక్కుకు దగ్గరగా ఉంచినప్పుడు మాత్రమే మామిడి పండు వాసన వస్తుంది.

రుచి..

- సహజంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడుతుంది. కావున తియ్యగా రుచిగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడక తక్కువ తీపిదనం, రుచి లేకుండా ఉంటాయి.

నిల్వ..

- సహజంగా మాగిన మామిడి పండ్లు మెత్తగా ఉంటాయి. ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- కృత్రిమంగా మాగిన వాటిలో పండ్ల తొక్క ముడతలు లేకుండా ఉండి గట్టిగా ఉంటాయి. పండు త్వరగా పాడైపోతుంది. తొక్కపై నల్లని చుక్కలు ఏర్పడతాయి.

- తప్పని పరిస్థితుల్లో కాయలు మాగబెట్టుటకు ఎథిలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే ఉపయోగించాలి. 100 పీపీఎం ఎథిలిన్ వాయువు 24 గంటలు తగిలేటట్లుగా ఉంచితే 5 రోజులలో సహజత్వానికి దగ్గరగా ఎలాంటి హాని లేకుండా మాగుతాయి.
- ఇంటిలో అయితే మాగని కాయల్లో కొన్ని మాగిన పండ్లను గాలి చొరవ డబ్బాలో ఉంచాలి. పక్వానికి వచ్చిన కాయలను ఒక రూములో వరి గడ్డి లేదా బోదగడ్డిలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల సహజ సిద్ధంగా మాగుతాయి.

కొనేటప్పుడు ఇలా చూడాలి..

సీజన్ రాకముందే అపరిపక్వముగా ఉండి కృత్రిమంగా మాగబెట్టిన రంగు వచ్చేటట్లు చేసిన పండ్లు కొనరాదు. రంగు చూసి మోసపోరాదు. సీజన్‌లో పండ్లు పరిపక్వత చెంది సహజముగా మాగిన పండ్లు కొనడం ఆరోగ్యదాయకం.

తినేటప్పుడు ఇలా చేయాలి..

పండ్లను ముందుగా ఉప్పు కలిపిన నీటిలో 15–20 నిముషాలు ఉంచి, తిరిగి వాటిని మంచినీటిలో కడిగి తడి లేకుండా తుడిచిన తర్వాత వాటిని తినాలి. లేదా ఫ్రిజ్‌లో ఉంచుకోవాలి. సాధ్యమైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడం మంచిది.

కార్బైడ్‌తో మాగిస్తే శిక్ష...

ఆహార సురక్షణ ప్రమాణాల చట్టం–2006 ప్రకారం కార్బైడ్ వాడి పండ్లు మాగబెట్టిన వారికి, అమ్మే వారికి ఒక ఏడాది జైలు శిక్ష, మూడు లక్షల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. కార్బైడ్ వాడిన పండ్లను తినడం వల్ల అనేక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఈ విషయం శాస్త్రీయంగా నిర్ధారణ అయింది.



పండ్లతోటల అభివృద్ధిపై అవగాహన కల్పించండి

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి నిధులతో పండ్ల తోటల అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో కల్లూరు, కృష్ణగిరి, కర్నూలు, ఓర్వకల్లు, వెల్దుర్తి, దేవనకొండ, కోడుమూరు మండలాలకు చెందిన సాంకేతిక సహాయకులకు పండ్ల తోటల అభివృద్ధికి సంబంధించి రైతులను గుర్తించడం ఎలా.. ఏ విధంగా ఎస్టిమేట్లు వేయాలి తదితర వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులందరూ పండ్లతోటల అభివృద్ధికి అర్హులేనని పేర్కొన్నారు. ఈ ఏడాది 6,750 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, వెంటనే అర్హులైన రైతులను గుర్తించడంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. డ్రైలాండ్ హార్టికల్చర్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్స్, నిమ్మ, సీతాఫలం తదితర రకాలు మొత్తంగా 17 రకాల సాగుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మండలాల వారీగా పండ్లతోటల అభివృద్ధికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు పీడీ మాధవీలత, ఏపీడీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

ప్యాపిలి: పోతుదొడ్డి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్ర ప్రసాద్ (23) మృతి చెందాడు. బనగానపల్లె మండల సాధుకొట్టం గ్రామానికి చెందిన నాగేశుడు కుమారుడు నాగేంద్రప్రసాద్ ట్రాక్టర్‌లో వరిగడ్డి లోడుతో బనగానపల్లె నుంచి గుత్తి వైపు వెళ్తున్నాడు. పోతుదొడ్డి వద్దకు రాగానే ట్రాక్టర్ వెనుకనే వస్తున్న లారీ అతివేగంతో వచ్చి ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్రప్రసాద్ లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 2 వేల భక్తులతో విష్ణు సహస్రనామ పారాయణం



మాట్లాడుతున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి

కర్నూలు కల్చరల్: గోదా గోకులంలో శ్రీరామాయణ మహాయజ్ఞం ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం 2 వేల మందితో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తున్నట్లు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి తెలిపారు. గురువారం గోదా గోకులంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్వామీజీ మాట్లాడుతూ.. సత్సంప్రదాయ పరిరక్షణ సభ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి శత జయంతి వేడుకల సందర్భంగా నాలుగు రోజులుగా గోదాగోకులంలో శ్రీమద్రామాయణ మహా యజ్ఞం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. రఘునాథాచార్య తిరు నక్షత్ర పవిత్ర తిథి సందర్భంగా రామాయణంలోని అంశాలపై ప్రవచకులచే ప్రసంగాలు ఇప్పించడం జరిగిందన్నారు. శుక్రవారం పలువురు జీయర్ స్వాములు, మఠాధిపతుల సమక్షంలో 2 వేల మందికి పైగా భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తున్నామన్నారు. శ్రీమద్రామాయణ ప్రవచన యజ్ఞ సమన్వయకర్త డాక్టర్ తొగట సురేష్‌బాబు, హిందీ అధ్యాపకురాలు పార్వతీ, తెలుగు ఉపాధ్యాయిని పసుపులేటి నీలిమ శ్రీమద్రామాయణం విశిష్టతపై ఉపన్యసించారు. సమావేశంలో ప్రయాగ్రాజ్ నుంచి రాఘవ ప్రసన్న జీయర్ స్వామీ, త్రిదండి శఠగోపముని రామానుజ జీయర్ స్వామీజీ, శ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామీజీ, గోదా గోకులం వ్యవస్థాప అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీమాను క్లెయిమ్ చేసి రూ.1.5 లక్షలు చెల్లించాలి

● యూనియన్ బ్యాంకును ఆదేశించిన కర్నూలు జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్

కర్నూలు(సెంట్రల్): అభయ గోల్డ్ బీమా పథకం కింద ఖాతాదారుడు మరణించినా క్లెయిమ్ చేయకుండా తిరస్కరించడంపై యూనియన్ బ్యాంకుపై కర్నూలు జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే బీమాను క్లెయిమ్ చేయించి బాధితుడి కుటుంబానికి రూ.1.5 లక్షలను చెల్లించాలని ఆ కమిషన్ చైర్మన్ కరణం కిశోర్‌కుమార్, సభ్యులు ఎస్.నజీమాకౌసర్ గురువారం తీర్పును వెల్లడించారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చెందిన పువ్వాడి రామసుబ్బయ్య యూనియన్ బ్యాంకు అభయ గోల్డ్ పాలసీ తీసుకున్నారు. అయితే అతను అనారోగ్యంతో మృతి చెందడంతో కుమారుడు పువ్వాడి సురేష్ బీమాను క్లెయిమ్ చేయాలని బ్యాంకును అభ్యర్థించాడు. అయితే బీమాదారుడు వయసు 70 సంవత్సరాలకు మించినందున క్లెయిమ్ చెల్లించబోమని కంపెనీ తిరస్కరించింది. దీంతో బాధితుడు కమిషన్‌ను ఆశ్రయించగా..ఖాతాపుస్తకంలో వయసు పరిమితి 05–75 సంవత్సరాలుగా ఉండడాన్ని గమనించిన కమిషన్ బాధితుడికి రూ.1.5లక్షలకు 9 శాతం వడ్డీతో పాటు రూ.10 వేలను మానసిక వేధింపులకు గురి చేసినందుకు, మరో 5 వేలను వ్యయంగా చెల్లించాలని ఆదేశించింది.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన బైక్, మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ సైదుల్

ఆదోని రూరల్: బైక్‌పై కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ గురువారం తెలిపారు. మండలంలోని పెసలబండ గ్రామానికి చెందిన నర్సారెడ్డి, కపటి గ్రామానికి చెందిన ఈడిగ హరిచంద్ర బైక్‌పై 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి బైక్, 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అలాగే మద్యం సరఫరా చేసిన పెసలబండ గ్రామానికి చెందిన గిడ్డయ్యపై కూడా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యా న్ని సరఫరా చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

సాతనూరులో ఉపాధి కూలీల హాజరుపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



కూలీల హాజరు శాతం నమోదు చేస్తున్న ఇన్‌చార్జ్ ఏపీఓ కాలిక్

కోసిగి: సాతనూరు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోజు వారి పనిదినాలకు వెళ్లే కూలీల సంఖ్య హాజరు శాతాన్ని అధికారులు నేరుగా గ్రామానికి వెళ్లి నమోదు చేశారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'ఉపాధి చిత్రాలు' కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఇందులో సాతనూరు గ్రామంలో 60 నుంచి 70 మందితో దొంగ పేర్లతో మస్టర్లలో నమోదు చేస్తున్నారని ఫిర్యాదు ఉన్నాయి. ఇందుకు స్పందించిన అధికారులు బుధ, గురువారాల్లో గ్రామానికి చేరుకుని నేరుగా కూలీలతో పనులు చేస్తున్న చోటుకు వెళ్లి మస్టర్లు పేర్లు పరిశీలించి హాజరు శాతం చేశారు. ఈ సందర్భంగా బుధవారం రోజు 260 మంది హాజరైనట్లు ఏపీఓ వెల్లడించారు. ఫీల్డు అసిస్టెంట్స్, మేటీలు అక్రమాలకు పాల్పడుతు దొంగ పేర్లతో మస్టర్లు నమోదు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే చింతకుంట గ్రామంలో ఈనెల 13, 14, 15వ తేదీలలో గ్రామం నుంచి 480 నుంచి 680 వరకు కూలీలు పనికి వెళ్లుతున్నట్లు మస్టర్లు పేర్లను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. ఒకే ఫొటోతో 8 నుంచి 10 మస్టర్ల వరకు పేర్లు మార్పు చేస్తు హాజరు నమోదు చేశారు. ఈ విషయంపై టెక్నికల్ అసిస్టెంట్ మంజు, ఇన్‌చార్జ్ ఏపీఓ కాలిక్‌ను వివరణ కోరగా.. పూర్తి స్థాయిలో విచారణ చేసి తప్పుడు పేర్లతో మస్టర్లు నమోదు చేసిన వాటిని తొలగించి వాస్తవంగా పని చేసిన వారి మాత్రమే ఆన్‌లైన్ బిల్లు వచ్చేలా ఎంట్రీ చేస్తామన్నారు.

దోపిడీకి 'టెంకాయ' కొట్టారు

● తర్తూరులో కొబ్బరి కాయల విక్రయాల్లో నిబంధనలు బేఖాతర్
● చిన్న సైజ్ కాయలు అధిక ధరకు విక్రయం



తర్తూరు జాతరలో ఏర్పాటుచేసిన టెంకాయల అంగడి

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో టెంకాయల విక్రయ దారుడు భక్తులను నిలువునా దోపిడీ చేస్తున్నాడు. వేలం పాటలో నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తూ భక్తుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఈనెల ఒకటోవ తేదీన ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి అధ్వర్యంలో టెంకాయలు, లడ్డూ, కొబ్బరి చిప్పల వేలం పాటలు నిర్వహించారు. పెద్దసైజు టెంకాయ ఒకటి రూ.30 చొప్పున విక్రయించాలని ముందుగానే వేలం పాటదారులకు టెంకాయసైజు చూపించి వేలం పాటలు నిర్వహించారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన రాజేష్ రూ.5.90 లక్షలకు పాట దక్కించుకున్నాడు. ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు టెంకాయలు విక్రయించేలా నిర్ణయించారు. విక్రయాల్లో కుళ్లిన కొబ్బరికాయకు మరో కాయ భక్తులకు ఇవ్వాలని, చిన్నసైజు టెంకాయలు అధిక ధరలకు విక్రయించరాదనే నిబంధనలు విధించారు. నిబంధనలను అతిక్రమిస్తే వేలం పాట రద్దు చేసి చెల్లించిన డబ్బులు వెనక్కి ఇవ్వమని తేల్చి చెప్పారు. అయినా నిబంధనలు పట్టించుకోకుండా చిన్న సైజ్ టెంకాయలను రూ. 35కు విక్రయిస్తున్నాడు. టెంకాయ కుళ్లిపోతే మరో టెంకాయ ఇవ్వకుండా, అధికధరలకు టెంకాయలు విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నాడు. భక్తులు ఫిర్యాదు చేసినా ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య




మృతిచెందిన బోయ కండ్ల వెంకటేష్

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ కండ్ల వెంకటేష్(70)కు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేష్‌కు గత ఆరేళ్ల నుంచి రెండు కాళ్ల బొటన వేళ్లకు కష్టు వ్యాధి వచ్చింది. అలాగే షుగర్ కూడా ఉంది. దీంతో కాళ్ల నొప్పి ఎక్కువై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెంది ఈనెల 15వ తేదీన రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో గడ్డి మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. భార్య, కుమారులు గమనించి ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బుధవారం కర్నూలుకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం తెల్లవారు జామున మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఈదురుగాలుల బీభత్సం

● ఏడు ఎకరాల్లో నేలకొరిగిన అరటితోట
● రూ. 20 లక్షల నష్టం



నేలకొరిగిన అరటి చెట్లు

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లె గ్రామంలో గురువారం సాయంత్రం ఈదురుగాలుల బీభత్సానికి అరటితోట నేలకొరిగింది. గ్రామానికి చెందిన ప్రేమసాగర్ రెడ్డి తనుకున్న 10 ఎకరాల్లో అరటి సాగు చేశాడు. మంచి దిగుబడి రావడంతో మరికొద్ది రోజుల్లో పంటకోసేందుకు సిద్ధమయ్యాడు. అయితే గురువారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులు బీభత్సాన్ని సృష్టించాయి. దీంతో ఏడు ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. ఎకరాకు రూ.1.5 లక్షల పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినట్లు రైతు వాపోయాడు. ప్రస్తుతం వచ్చిన దిగుబడిని విక్రయిస్తే దాదాపు రూ.20 లక్షల ఆదాయం వచ్చేదని తెలిపాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

డోన్ టౌన్: చెట్లు కొట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాడు. మల్యాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (45) పట్టణంలో నివాసం ఉంటున్నాడు. గురువారం చంద్రశేఖర్, అతని కుమారుడు రమేష్, మరి కొంత మంది కలిసి పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలంలో చెట్టును కొట్టేందుకు కూలీకి వెళ్లారు. కొమ్ములు కొడుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగ తెగి చంద్రశేఖర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పొలం యజమాని చంద్ర, కూలీలను పనికి తీసుకెళ్లిన నాగరాజు నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని మృతుడు కుమారుడు పోలీసులు ఫిర్యాదు చేశారు.